ఆంధ్రజ్యోతి

మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 34.6, కనిష్ఠం 25.8

కామారెడ్డి
జిల్లా వార్తలు

5

బుధవారం 14 ఆగస్టు 2024



దోమకొండలో హర్‌ఘర్ తిరంగా యాత్ర

దోమకొండ, ఆగస్టు 13: మండల కేంద్రంలో మంగళవారం బీజేపీ నాయకులు హర్‌ఘర్ తిరంగా యాత్ర కార్యక్రమం నిర్వహించారు. అంతకు ముందు సుభాష్ చంద్రబోస్ విగ్రహనికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఇంటింటికీ జెండాలను పంపిణీ చేశారు. ప్రతీ ఇంటిపైన జెండాను ఆవిష్కరించాలన్నారు.కార్యక్రమంలో మండలాధ్యక్షుడు మద్దూరి భూపాల్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, కంది మనోజ్ కుమార్, జగదీశ్, రవి, సుజాత, అంజమ్మ, సచిన్‌గౌడ్, తేల్ల ప్రభాకర్, రంజిత్, పాల్గొన్నారు.

చెరువులకు చేరని నీరు!



- ముసురు వానలతో సరిపెడుతున్న వరణుడు
- నీరు లేక వెలవెలబోతున్న వెయ్యికి పైగా చెరువులు, కుంటలు
- అంతంతమాత్రంగానే పెరిగిన భూగర్భజలాలు
- 13.57 మీటర్లలో భూగర్భజలాల నీటిమట్టం
- ప్రధాన ప్రాజెక్ట్‌లలోకి రాని వరద
- వరి పంటసాగుపై తీవ్ర ప్రభావం
- వరి రైతుల్లో నెలకొంటున్న ఆందోళన
- ఆరుతడి పంటలకు మాత్రమే అనుకూలం

కామారెడ్డి,ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆశించిన స్థాయిలో వర్షాలు పడకపోవడంతో చెరువులు, కుంటలు, ప్రధాన ప్రాజెక్ట్‌లు వెలవెలబోతున్నాయి. వర్షాకాలం ప్రారంభమై రెండున్నర నెలలు గడుస్తున్నా ఇప్పటికీ చెప్పుకోదగ్గ వర్షాలు కురిసిన దాఖలాలులేవు. దీంతో చెరువులు, కుంటలు, ప్రధాన ప్రాజెక్ట్‌లలోకి నీరు రాలేదు. వాస్తవానికి ఇప్పుడు భారీ వర్షాలు కురిసే సమయం. చెరువులు,కుంటల్లో సమృద్ధిగా నీరు చేరి నిండుకుండల్లా కనిపించాలి. కాని అలాంటి వానలే కరువయ్యాయి. అయితే ప్రస్తుతం జిల్లాలో ప్రతిరోజు చిరుజల్లులు కురుస్తూనే ఉన్నా సాగునీటి వనరులు ఖాళీగా కనిపిస్తున్నాయి. చెరువులు, కుంటల్లోకి నీరు సంవృద్ధిగా రాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ వానకాలంలో వరి సాగు చేసేదేలా అంటూ తలలు పట్టుకుంటున్నారు. ఇప్పటి వరకు బోర్లు, బావుల కింద మాత్రమే వరినాట్లు వేస్తున్నారు. ఈ వానకాలం ప్రారంభంలోనే ఒకటిరెండు భారీ వర్షాలు తప్ప జిల్లాలోని అన్ని మండలాల్లో మోస్తార్ వర్షాలే కురిశాయి. ఇలాంటి పరిస్థితుల్లో భారీ వర్షాల కోసం రైతులు ఎదురుచూస్తున్నారు.

• నిండుకోని వెయ్యిపైగా చెరువులు,కుంటలు

జిల్లాలో మొత్తం 1425 చెరువులు ఉన్నాయి. ఇందులో వెయ్యికి పైగా చెరువులు నిండుకోలేదు. ఈ చెరువుల్లోకి ఆశించిన మేర వరద రాకపోవడంతో వెలవెలబోతున్నాయి. కేవలం 200 చెరువులు మాత్రమే నిండుకుని అలుగులు పారుతున్నట్లు సంబంధిత శాఖాధికారులు చెబుతున్నారు. సరిగ్గా గత ఏడాది ఈ సమాయానికి జిల్లాలో 257 చెరువులు పూర్తిగా నిండుకుని అలుగులు దూకాయి. 310 చెరువులు వందశాతం నిండుకున్నాయి. 457 చెరువులు 75శాతం నిండగా 423 చెరువులు 50శాతం నిండుకున్నాయి. ఈసారి ఆశించిన మేర వర్షాలు లేకపోవడంతో చెరువులలోకి వరద రావడంలేదు. జిల్లాలో చెరువుల కింద లక్ష ఎకరాలకు పైగానే ఆయాకట్టు ఉంది. వీటిని నమ్ముకునే రైతులు వరిపంటను,ఇతర పంటలను సాగుచేస్తున్నారు. సీజన్ సగం ముగిసినప్పటికి వర్షాలు లేకపోవడం, చెరువులు నిండకపోవడంతో పంటలను సాగుచేసేది ఎలా అని రైతుల్లో ఆందోళన ఎదురవుతుంది.

• వెలవెలబోతున్న ప్రాజెక్ట్‌లు

జిల్లాలోని ప్రధాన ప్రాజెక్ట్‌లలోకి వరద ఆశించిన మేర రావడంలేదు. జిల్లాలోని నిజాంసాగర్, పోచారం ప్రధాన ప్రాజెక్ట్‌లు ఉన్నాయి. ఈ ప్రాజెక్ట్‌ల కింద సుమారు లక్ష 50వేల ఎకరాలలో పంటలు సాగవుతున్నాయి. ఈ సీజన్‌లో ప్రాజెక్ట్‌లోకి వరద రాకపోవడంతో ఆయాకట్టు రైతుల్లో ఆందోళన నెలకొంటుంది. నిజాంసాగర్ ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 17.802 టీఎంసీలు కాగా ప్రస్తుతం 3.997 టీఎంసీలలో మాత్రమే నీరు నిల్వ ఉంది. గడిచిన రెండునెలల్లో ప్రాజెక్ట్‌లోకి అరటీఎంసీ నీరు మాత్రమే వచ్చి చేరింది. పోచారం ప్రాజెక్ట్ సైతం పూర్తిగా నిండుకోలేదు. ఎగువ ప్రాంతాన ఆశించిన మేర వర్షాలు లేకపోవడంతో ప్రాజెక్ట్‌లోకి వరద రావడం లేదు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1.820టీఎంసీలు కాగా ప్రస్తుతం 0.954 టీఎంసీలు మాత్రమే నీరు నిల్వ ఉంది. ఈ ప్రాజెక్ట్‌లోకి గడిచిన రెండునెలల్లో అరటీఎంసీ మాత్రమే వరద వచ్చి చేరింది. కౌలాస్‌ప్రాజెక్ట్‌సైతం వరద రాక వెలవెలబోతుంది.

• అంతంత మాత్రంగానే పెరిగిన భూగర్భజలాలు

జిల్లాలో ఆశించిన మేర వర్షాలు లేక భూగర్భజలాల పెరుగుదల నామమాత్రంగానే ఉంది. ఈ ఏడాది జూన్‌లో 14.46 మీటర్లు ఉన్న భూగర్భజలం జూలైలో 13.57 మీటర్లకు చేరింది. నెలవ్యవధిలో 0.89 మీటర్ల మేర స్వల్పంగా పెరిగింది. జిల్లాలో చెరువులు,కుంటలు జలశయాలలో నీటి నిల్వలు ఆశించిన స్థాయిలో లేవు. గత ఏడాది జూలైలో నీటిమట్టంతో పోలిస్తే 4.36 మీటర్లు తక్కువగా ఉంది. జిల్లాలో భూగర్భజలాల పైనే ఆధారపడి బోర్ల ద్వారా రైతులు పంటలను సాగుచేస్తుంటారు. భూగర్భజలాల పెరుగుదల సైతం ఆశించినస్థాయిలో లేకపోవడంతో బోర్ల ద్వారా పంటలు సాగుచేయడం కష్టమేనని రైతులు వాపోతున్నారు.

• ఆరుతడి పంటలకు అనుకూలం

జిల్లాలో కురుస్తున్న అడదపడప వర్షాలతో ఆరుతడి పంటలకే అనుకులంగా మారనుంది. ముసురు వర్షాలతో ఆరుతడి పంటలను విస్తరంగానే సాగు చేశారు. ప్రస్తుతం జిల్లాలో సోయా, పత్తి, మొక్కజొన్న, కందులు, పెసర్లు, మినుములు సుమారు 2లక్షల ఎకరాలలో సాగు అయ్యాయి. గత ఏడాది వర్షకాలంలో కురిసిన వర్షాలకు చెరువులు, కుంటలు నిండగా యాసంగిలో విస్తరంగానే పంటలను సాగు చేశారు. దీంతో నిరంతరాయంగా బోర్లు నడిపించడంతో పాతాలగంగా పూర్తిగా ఎత్తిపోశారు. జిల్లాలో ఇప్పటివరకు 482.6 మి.మిల వర్షం కురిసింది. సాధారణ వర్షపాతం నమోదైంది. ఇప్పటికి నిజాంసాగర్, దోమకొండ, బీబీపేట, పల్వంచ, ఎల్లారెడ్డిమండలాల్లో లోటు వర్షపాతమే ఉంది.

• జిల్లాలో పంటల సాగు ఇలా..

జిల్లాలో వానకాలం సీజన్‌లో ఇప్పటివరకు రైతులు సుమారు 2.90 లక్షల ఎకరాలలో వివిధ పంటలను సాగుచేస్తున్నారు. జిల్లా సాధారణ సాగు 5.14 లక్షల ఎకరాలు కాగా ఇప్పటివరకు సుమారు 70శాతం మేర పంటలుసాగవుతున్నాయి. ఇందులో ప్రధానంగా వరి,మొక్కజొన్న, పత్తి,సోయా, పప్పుదినుసు పంటలనుసాగుచేస్తున్నారు. జిల్లాలో ఈవానకాలం లో అత్యధికంగా వరిపంట సాగుచేస్తున్నారు. ఈ సీజన్‌లో 3.13లక్షల ఎకరాలలో వరి సాగవుతుందని అధికారులు అంచనా వేశారు. ఇప్పటివరకు 1.29లక్షల ఎకరాల్లో వరినాట్లు పడ్డాయి. ఈనెల చివరికల్లా మరిన్ని వరినాట్లు పడే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. మొక్కజొన్న 29,927 ఎకరాలలో సాగయింది.సోయాబిన్ 79,424 ఎకరాలలో, పత్తి 24, 311, కందులు 16425 ఎకరాలలో,మినుములు 4,920, పెసర్లు 4,596, జొన్న 30 ఎకరాలలో పంటలు సాగయ్యాయి.



దోమకొండ మండలంలో నిండని చెరువు



వరద లేక వెలవెలబోతున్న టెక్రియాల్ చెరువు



నీరు లేక బోసిపోతున్న పాతరాజంపేట చెరువు



ఎల్లారెడ్డి గాంధీ చౌక్‌లో మానవహారం నిర్వహించిన దృశ్యం

ఎల్లారెడ్డిలో బంద్ ప్రశాంతం

ఎల్లారెడ్డి, ఆగస్టు13: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ హిందూ సంఘాలు పిలుపుమేరకు ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో మంగళవారం చేపట్టిన బంద్ ప్రశాంతంగా సాగింది. వ్యాపార సముదాయాలు, పెట్రోల్ బంకులు విద్యాసంస్థల యాజమాన్యాలు స్వచ్ఛందంగా బంద్ పాటించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా పోలీసులు బందోబస్తు చేపట్టారు. సాయంత్రం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో ఉన్న పోచమ్మ ఆలయం నుంచి గాంధీచౌక్ వరకు ర్యాలీగా మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిందువులపై జరుగుతున్న దాడులను ఖండించారు. ఇంతటితో దాడులు ఆగాలని లేనిచో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని వారికి తగిన పరిణామం ఎదుర్కోవాల్సిందే అని హెచ్చరించారు. కార్యక్రమంలో బజరంగ్దళ్ విశ్వహిందూ పరిషత్ బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ డెలివరీ వేగవంతం చేయాలి

• కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

కామారెడ్డిటౌన్, ఆగస్టు13: సీఎంఆర్ డెలివరీ వేగవంతం చేయాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. కామారెడ్డి కలెక్టరేట్‌లో మంగళవారం సివిల్‌సప్లై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు రైస్‌మిల్లులను నిరంతరం తనిఖీలు చేస్తూ డెలివరీ వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. లక్ష్యానికి అనుగుణంగా డెలివరీ కాకపోతే రైస్‌మిల్లుల యాజమానులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి నిత్యానందం, డిటీలు కిష్టయ్య, తదితరులున్నారు.

పార్కుల్లోని ఆట వస్తువులు వినియోగంలోకి తేవాలి

పార్కుల్లోని ఆటవస్తువులు వినియోగంలోకి తీసుకురావాలని కలెక్టర్ ఆశీస‌సంగ్వాన్ కామారెడ్డి మున్సిపల్ కమిషనర్ సుజాతను ఆదేశించారు. మంగళవారం పట్టణంలోని రాజీవ్‌పార్క్‌ను కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా పార్కులో చెడిపోయిన ఆటవస్తువులను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. చెడిపోయిన వాటి స్థానంలో కొత్త ఆట వస్తువులను ఏర్పాటు చేయాలని, నడకదారిలో ఉన్న పిచ్చిమొక్కలను తొలగించాలని, మహిళాసంఘాల ఆధ్వర్యంలో పార్క్‌లో క్యాంటిన్ ఏర్పాటు చేయించాలని సూచించారు. ఎల్లప్పుడు మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచాలని పార్క్‌ను ఆహ్లాదవాతవరణంగా వ‌ర్చాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇందుప్రియ, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

జాతీయరహదారి పక్కన వ్యర్థాలను పారేసే వారికి జరిమానాలు విధించాలి

జాతీయ రహదారి పక్కన వ్యర్థాలను పారేసే వారికి జరిమానాలు విధించాలని కలెక్టర్ ఆశీస‌సంగ్వాన్ అన్నారు. మంగళవారం మండలంలోని రామేశ్వర్‌పల్లి శివారులో ఉన్న డంపింగ్‌యార్డును కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని చెత్తచెదారాన్ని సేకరించి 16ఎకరాల్లో ఉన్న ఈ డంపింగ్ యార్డుకే తీసుకురావాలన్నారు. ఇక్కడ వేసిన చెత్తతో కంపోస్టు ఎరువులు తయారు చేయాలన్నారు. 44వ జాతీయరహదారి పక్కన గల కళ్యాణమండపాల నిర్వాహకురాలు వ్యర్థపదార్థాలను రోడ్డు పక్కనే పారేస్తున్నారని స్థానికులు కలెక్టర్‌దృష్టికి తీసుకురాగా వ్యర్థాలను జాతీయరహదారి పక్కన పారేసే వారికి భారీగా జరిమానాలు విధించాలని మున్సిపల్ కమిషనర్ సుజాతను ఆదేశించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

స్వాతంత్ర వేడుకలకు ముఖ్యఅతిథిగా పటేల్ రమేష్ రెడ్డి

కామారెడ్డి రూరల్: స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా రాష్ట్రప్రభుత్వం ఆయా జిల్లాలో జాతీయజెండా ఆవిష్కరించేందుకు ముఖ్యఅతిథిలను కేటాయిస్తూ మంగళవారం ఉత్వరులు జారీచేసింది. జిల్లాకేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో ఆగస్టు15న స్వాతంత్ర వేడుకలను నిర్వహించనున్నారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా తెలంగాణ టూరిజం ఛైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి హాజరుకానున్నారు. వేడుకల్లో పాల్గొని ఛైర్మన్ జాతీయజెండాను ఆవిష్కరిస్తారు. ఈ వేడుకలకు జిల్లా యత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. అదేవిధంగా కామారెడ్డికి చెందిన ప్రభుత్వసలహా దారుడు షబ్బీర్‌అలీ ఆదిలాబాద్ జిల్లాలోజరిగే స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో ముఖ్యఅతిథిగా హాజరై జాతీయజెండాను ఆవిష్కరిస్తారు. జిల్లాకేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లను మంగళవారం కలెక్టర్ ఆశిష్‌సంగ్వాన్ పరిశీలించారు. మైదానాన్ని వేడుకలకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేయ్యాలని కలెక్టర్ ఆదేశించారు. ఏర్పాట్లు అన్నీ పకడ్బందీగా చేయాలని సూచించారు. కలెక్టర్‌వెంట మున్సిపల్ ఛైర్మన్ ఇందుప్రియ, ఆర్‌డీవో రంగనాథ్‌రావు, డీఎస్పీ నాగేశ్వరరావు, సీఐ చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఇందిరా గాంధీ క్రీడా మైదానాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

అస్తవ్యస్తంగా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం!

- రెగ్యూలర్ సబ్‌రిజిస్టర్ లేక ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీ
- మధ్యాహ్నం 12 అయినా విధులకు హాజరుకాని సిబ్బంది
- సర్వర్ పనిచేయడం లేదని ఖాళీగా కూర్చున్న ఉద్యోగులు
- రిజిస్ట్రేషన్ పత్రాల కోసం ఎదురు చూస్తున్న ప్రజలు

బాన్సువాడ, ఆగస్టు 13: బాన్సువాడ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం అస్తవ్యస్తంగా మారింది. సిబ్బంది సమయపాలన పాటించడం లేదు. విధులు నిర్వహిస్తున్న సిబ్బంది ఇష్టారీతిన వ్యవహరించడం ఇటు ప్రజలకు అటు డాక్యుమెంట్ రైటర్లకు తలనొప్పిగా మారినట్లు తెలుస్తోంది. బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలో ఇళ్ల స్థలాలు, ఇళ్ల రిజిస్ట్రేషన్ల కోసం ప్రజలు కార్యాలయం చుట్టూ తిరుగుతున్న గతంలో విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన అధికారుల డాక్యుమెంట్ పత్రాలు ఇప్పటికీ ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి డాక్యుమెంట్లు ఇవ్వకపోవడంతో ప్రలు మండిపడుతున్నారు. గతనెల కింద రిజిస్ట్రేషన్ చేసినప్పటికీ ఇప్పటివరకు పత్రాలు ఇవ్వకపోవడంతో రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రజలు కార్యాలయంలో ఆందోళన చేపట్టారు. అంతేకాకుండా విధులు నిర్వహించేందుకు రెగ్యూలర్ సబ్‌రిజిస్ట్రార్ ఇప్పటివరకు నియామకం కాకపోవడంతో రిజిస్ట్రేషన్ విషయంలో సమస్యలు తలెత్తుతున్నాయని ప్రజలు మండిపడుతున్నారు. ఇంచార్జి సబ్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహిస్తున్న అధికారి ఎప్పుడు వస్తారు.. ఎప్పుడు వెళ్తారో తెలియని పరిస్థితి నెలకొంది. ఇదిలా ఉంటే రెగ్యూలర్ డ్యూటీ కింద బదిలీ అయిన అటెండర్ సమయపాలన పాటించక మధ్యాహ్నం 12 గంటలైనా కార్యాలయానికి రాకపోవడం ఇష్టారీతిన విధులు నిర్వహించడం పట్ల అటు పలువురు అటెండర్ విధుల పట్ల మండిపడుతున్నారు. అంతేకాకుండా కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లు కూడా హిస్టారికల్ వ్యవహరించడం ప్రజలకు సరైన సమాధానం చెప్పకపోవడం అంతేకాకుండా రిజిస్ట్రేషన్ విషయంలో సమయాన్ని వృధా చేయడం పట్ల మండిపడుతున్నారు. ఇప్పటికైనా విధుల పట్ల నిర్లక్ష్యం చేసే వారిపై జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు పలువురు డిమాండ్ చేస్తున్నారు. సిబ్బంది సమయపాలన పాటించకపోవడంపై జూనియర్ అసిస్టెంట్ అవేజ్‌ను వివరణ కోరగా అటెండర్‌కు పని ఉందని ఆలస్యంగా వస్తున్నారని సమధానం చెప్పడంతో అక్కడున్న పలువురు ముక్కున వేలేసుకున్నారు. దర్జాగా విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారని సమాధానం చెప్పడం విధుల పట్ల ఎంత నిర్లక్ష్యం వహిస్తున్నారో అని ఇట్టే తెలుస్తుందని ప్రజలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా విధుల పట్ల నిర ్లక్ష్యం వహిస్తున్న సిబ్బందిపై అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



బాన్సువాడ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఖాళీగా ఉన్న సబ్‌రిజిస్ట్రార్ కుర్చీ



బాన్సువాడ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో మధ్యాహ్నం 12 అయినా హాజరుకాని సిబ్బంది

ఆర్థిక ఇబ్బందులతో బోధన్ వ్యాపారి ఆత్మహత్య

● మెట్‌పల్లిలోని ఆర్‌బీ లాడ్జిలో ఘటన ● అప్పుల బాధ భరించలేకే సూసైడ్



బాలి రాజేందర్ (ఫైల్)

మెట్‌పల్లి , ఆగస్టు 13 : జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణంలోని ఆర్‌బీ రెస్టారెంట్‌లో మంగవారం నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణానికి చెందిన బాలి రాజేందర్(48) అనే వ్యాపారి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు మెట్‌పల్లి ఎస్సై చిరంజీవి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం..

రాజేందర్ బోధన్ పట్టణంలో హర్షిని ట్రేడర్స్ పేరుతో సిమెంట్, ఇనుము వ్యాపారాన్ని 11 సంవత్సరాలుగా నిర్వహిస్తున్నాడు. సోమవారం బోధన్ నుంచి కోరుట్లలోని తన బంధువుల ఇంటికి వచ్చాడు. రాత్రి కావడంతో ఇంటికి వెళ్లలేక పట్టణంలోని ఆర్‌బి రెస్టారెంట్, లాడ్జిలో గది తీసుకున్నాడు. మంగళవారం ఉదయం 3 గంటల సమయంలో ఓ వాట్సప్ గ్రూప్‌లో, తన భార్య శిరీషకు ఆర్థిక ఇబ్బందుల వల్ల తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సందేశం పంపాడు. అప్రమత్తమైన కుటుంబ సభ్యులు, స్నేహితులు 100 కాల్‌తో పాటు మెట్‌పల్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు లాడ్జికి వెళ్లి చూసేసరికి రాజేందర్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుని ఉన్నాడు. ఆర్థిక ఇబ్బందులు, అప్పుల బాధ భరించలేకే ఆత్మహత్య చేసుకుంటున్నట్లు రాజేందర్ రాసిన సూసైడ్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అయితే తనను ఇద్దరు మోసం చేశారని, 15 సంవత్సరాలుగా డబ్బులు ఇస్తానని ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని ఆ ఇద్దరి వల్లే తనకు ఈ పరిస్థితి వచ్చిందని ఇద్దరు పేర్లు సూసైడ్ నోట్‌లో పేర్కొన్నాడు. అదే విధంగా పలు యాప్‌లలో భార్యకు తెలియకుండా లోన్లు తీసుకున్నాడని వాటి ఇబ్బందులు భరించలేక ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. తన కూతురు, కొడుకును స్నేహితులు ఆదుకుని ఉన్నత చదువులకు సహకారం అందించాలని అందులో కోరాడు. వ్యాపారి రాజేందర్‌ది స్వస్థలం మల్లాపూర్ మండలం మొగిలిపేట కాగా.. 15 ఏళ్ల క్రితమే బోధన్ వెళ్లి అక్కడే స్థిరపడినట్లు స్నేహితులు తెలిపారు. భార్య శిరీష ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. మృతుడికి ఎంత అప్పు ఉందన్న విషయమై పూర్తి స్థాయిలో విచారణ చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

'సీఎం రేవంత్‌రెడ్డితో ముడుపు విప్పించాలి'



ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డితో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ఏర్గట్ల, ఆగస్టు 13: మండలంలోని కాంగ్రెస్ నాయకులు మంగళవారం బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా ఏర్గట్లలో కార్నర్ మీటింగ్‌లో పాల్గొన్న రేవంత్‌రెడ్డి సీఎం కావాలని చెట్టుకు ముడుపు కట్టడం జరిగిందన్నారు. ఏర్గట్లకు ఉన్న సెంటిమెంట్‌తో ఆయన సీఎం పీఠాన్ని అధిష్టించారని, ఆ ముడుపును సీఎంతో విప్పించాలన్నారు. దాని కోసం సీఎం రేవంత్‌రెడ్డి మండల పర్యటన కోసం తగిన సమయం కేటాయించేలా చూడాలని ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిని కోరారు. ఇందుకు సుదర్శన్‌రెడ్డి కూడా సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు శివన్నోల్ల శివకుమార్, మండల పార్టీ సోమదేవరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

● ఎమ్మెల్యేకు మార్కెట్ కమిటీ సన్మానం

బోధన్‌రూరల్ : బోధన్ మార్కెట్ కమిటీ నూతన కార్యవర్గాన్ని ప్రకటించిన సందర్భంగా మంగళవారం బోధన్ మార్కెట్ కమిటీ నూతన కార్యవర్గం ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో సన్మానించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ అంకు సంధ్య దాములతో వైస్ చైర్మన్ చీల శంకర్‌లతో పాటు కమిటీ సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు నాగేశ్వర్ రావు, వై.నరేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు గంగాజీ, శంకర్, గడ్డంశ్రీను, ప్రకాష్ ,అశోక్, శివప్రసాద్ తదితరులున్నారు.

మోర్తాడ్ బంద్ ప్రశాంతం



మోర్తాడ్‌లో తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

మోర్తాడ్,ఆగస్టు13: మోర్తాడ్ మండల కేంద్రంలో బంగ్లాదేశ్‌లో హిందువులపై అమానుషంగా దాడులు చేయడం పట్ల విశ్వహిందు పరిషత్ పిలుపు మేరకు మంగళవారం మోర్తాడ్ బంద్ సంపూర్ణంగా జరిగింది. ఉదయం నుంచి వ్యా పార సంస్థలు, ఓటర్లు, ఇతర దుకాణాలు పూర్తి బంద్‌ను పాటించాయి. విశ్వ హిందు పరిషత్ నాయకులు, బీజేపీ నాయకులు మోర్తాడ్‌లో ప్రధాన వీధుల గుండా తిరుగుతూ బంద్ పాటింపజేశారు. అనంతరం పలు గ్రామాల నుంచి తరలివచ్చిన బీజేపీ నాయకులు, విశ్వహిందు పరిషత్ నాయకులతో కలిసి ఊరే గింపుగా వెళ్లి తహసీల్దార్ సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. కేంద్ర ప్రభుత్వం బంగ్లాదేశ్‌లోని హిందువులను ఆదుకునేందుకు వెంటనే చర్యలు చేప ట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు నరేష్, నాయకులు తీగెల రమేష్, జైడి గంగారెడ్డి, సంగెం అనిల్, శ్రీనివాస్‌రెడ్డి, వినీత్ కుమార్, నాయకులు, యువకులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: బంగ్లాదేశ్ హిందువులపై దాడుకు నిరసనగా హిందు సంఘాల పిలుపు మేరకు మంగళవారం కమ్మర్‌పల్లి బంద్ విజయవంతమయ్యింది. బంద్ కు సహకరించాలని ఒకరోజు ముందుగానే పిలుపున్విడంతో.. మంగళవారం ఉదయం నుండే దుకాణాలు,వ్యాపార సంస్థలు, విద్యాసంస్థలు మూసి ఉంచారు. బంద్ కారణంగా జనసంచారంలేక జాతీయరహదారి వెలవెలబోయింది. దాడులలో అసువులు బాసిన వారికి కొవ్వొత్తులతో నివాళులర్పించారు.

రుద్రూరు: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడు లకు నిరసనగా మంగళవారం హిందూ సంఘాలు ఇచ్చిన బంద్ రుద్రూరు మండల కేంద్రంలో విజయ వంతమైంది. మంగళవారం ఉదయం నుంచి దుకాణాలు, వ్యాపార స ముదాయాలు, పెట్రోల్ బంక్‌లు, పాఠశాలలు, స్వచ్ఛం దంగా మూసి ఉంచారు. హిందువులపై దాడులను వెంటనే నిలిపివేయాలని ఇందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ రుద్రూరు తహసీల్దార్ వెంకటేశ్వ ర్లుకు వినతిపత్రాన్ని అందజేశారు.

పోతంగల్‌లో ఇసుక డంప్‌ల సీజ్

కోటగిరి,ఆగస్టు13: పోతంగల్ మండలంలోని కొడిచర్ల గ్రామంలో మంగళవారం ఇసుక డంప్‌లను తహసీల్దార్ మల్లయ్య సీజ్ చేశారు. కొడిచర్ల గ్రామంలో గుడి వద్ద ఐదు ట్రాక్టర్ల ఇసుక పోతంగల్ వెళ్లే దారిలో 20ట్రాక్టర్ల ఇసుక అక్రమంగా నిల్వ చేసినట్లు గుర్తించామన్నారు. సుమారు 25ట్రాక్టర్ల ఇసుకను సీజ్ చేశామని తహసీల్దార్ తెలిపారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో ఇసుక వేలం నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. ఇసుక వేలంలో పాల్గొనే వారు 5వేల రూపాయలు చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు. గ్రామాలలో ఇసుకను అక్రమంగా నిల్వ చేస్తే వారిని గుర్తించి క్రిమినల్ చర్యలు చేపడతామని తహసీల్దార్ పేర్కొన్నారు.

నవీపేటలో ఇసుక టిప్పర్ పట్టివేత

నవీపేట,ఆగస్టు13: మండల కేంద్రంలోని దర్యాపూర్ తండా సమీపంలో సోమవారం రాత్రి అక్రమంగా తరలిస్తున్న ఇసుక టిప్పర్‌ను పట్టుకోవడం జరిగిందని తహసీల్దార్ నారాయణ తెలిపారు. రెంజల్ మండలం నీలా నుండి నవీపేట వైపు ఇసుక టిప్పర్ వస్తుండగా సంబంధిత టిప్పర్‌ను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించడం జరిగిందన్నారు. మంగళవారం టిప్పర్ యాజమానికి 20వేల రూపాయల జరిమాన విధించినట్లు తహసీల్దార్ తెలిపారు.

మొరం టిప్పర్ యజమానికి జరిమానా

నవీపేట,ఆగస్టు13: మండలంలోని ఫత్తేనగర్ శివారు నుండి నవీపేటకు అక్రమంగా తరలిస్తున్న మొరం టిప్పర్‌ను ఆదివారం పట్టుకోగా సంబంధిత టిప్పర్ యాజమానికి మంగళవారం 10వేల రూపాయల జరిమాన విధించినట్లు తహసీల్దార్ నారాయణ తెలిపారు. ఆదివారం రాత్రి నుండి ఫత్తేనగర్ శివారు నుండి అక్రమంగా నవీపేటలోని బర్కత్ పుర కాలనీకి అక్రమంగా మొరం తరలిస్తుండగా సంబంధిత టిప్పర్‌ను పోలీసులు పట్టుకున్నారని మంగళవారం టిప్పర్ యాజమానికి జరిమాన విధించినట్లు తహసీల్దార్ వివరించారు.

బోధన్‌లో రౌడీ షీటర్ రిమాండ్

బోధన్‌రూరల్,ఆగస్టు13: బోధన్ పట్టణంలో మంగళవారం షేక్.అబ్బు అనే రౌడీ షీటర్‌ను పోలీసులు రిమాండ్ చేసినట్లు పట్టణ ఎస్ఐ వీరయ్య తెలిపారు. కోర్టు 14రోజుల పాటు జైలుశిక్ష విధించినట్లు ఆయన తెలిపారు. పట్టణంలో అకారణంగా ఎవరైనా ఆందోళనకు పాల్పడిన అవాంఛనీయ సంఘటనలకు పాల్పడిన, అల్లర్లకు పాల్పడిన, చట్టాలను అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కొత్త చట్టాలు అమల్లోకి వచ్చాయని కొత్త చట్టాలను అతిక్రమించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఓపెన్ స్కూల్ ఎస్ఎస్‌సీ, ఇంటర్ చదువుకునే వారికి అడ్మిషన్లు ప్రారంభం

వేల్పూర్,ఆగస్టు13: ఓపెన్ స్కూల్ ద్వారా పదవ తరగతి, ఇంటర్మీడియేట్ చదువుకునే ఆసక్తి ఉన్న వారికి 2024-25సంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభమైనట్లు వేల్పూర్ హైస్కూల్ హెచ్ఎం ఎ.రాజన్న తెలిపారు. పదో తరగతి, ఇంటర్ చదువుకునేందుకు ఈనెల 8 నుంచి సెప్టెంబర్ 20వ తేదీ వరకు ఏటువంటి అపరద రుసుము లేకుండా అడ్మిషన్‌లు చేసుకోవచ్చన్నారు. అపరద రుసుముతో అక్టోబర్ 3వ తేదీ వరకు అడ్మిషన్ చేసుకోవచ్చన్నారు. పదో తరగతి అడ్మిషన్ చేసుకునే వారు ఇంత వరకు చదివిన టిసి, పుట్టిన తేదీ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, రెండు ఫోటోలు, కుల, ఆదాయ జిరాక్స్‌లతో దరఖాస్తులు చేసుకోవాల న్నారు. ఇంటర్మీడియేట్ చదివే వారు పదవ తరగతి మెమో, టీసీ, కుల, ఆదాయ, ఆధార్, రెండు ఫోటోలు రెం డు జిరాక్స్‌లతో దరఖాస్తు చేయాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాల కోసం బోడ దేవనందం 9440839040, ఎస్.శైలజ 8522855825 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

మందకృష్ణకు స్వాగతం పలకడానికి

హైదరాబాద్ తరలివెళ్లిన మాదిగలు



మందకృష్ణ మాదిగకు స్వాగతం పలికేందుకు వెళ్తున్న వేల్పూర్ మాదిగలు

వేల్పూర్,ఆగస్టు13: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఎస్సీవర్గీకరణ సాధించిన అనంతరం తొలిసారిగా తెలంగాణ రాష్ట్రంలో అడుగు పెడుతున్న సందర్భంగా ఆయన స్వాగత ర్యాలీకి మంగళవారం వేల్పూర్ మండలం ఎమ్మార్పీఎస్ నాయకులు నాయ కులు, మాదిగలు తరలివెళ్లారు. తరలివెళ్లిన వారిలో మండల ఎమ్మార్పీఎస్ నాయకుడు మంద ప్రభాకర్ మాదిగ, బోయిడి బాలకిషన్ మాదిగ, బక్కోల్ల ప్రశాంత్ మాదిగ, చాట్లపల్లి రాహుల్ మాదిగ, గుడాల ప్రవీన్ మాదిగ, ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షులతో కలిసి మాదిగలు వెళ్లారు.

సిరికొండ: మాదిగ ఉపకులాల రిజర్వేషన్లను సాధించి హైదరాబాద్ వస్తున్న మందకృష్ణ మాదిగకు స్వాగత కార్యక్రమానికి సిరికొండ మండలం నుంచి ఎంఆర్‌పీఎస్ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. ముప్పై ఏళ్ల పోరాట కల నెరవేర్చిన కృష్ణన్నకు కృతజ్ఞులమని ఎంఆర్‌పీఎస్ జిల్లా కార్యదర్శి సంజీవ్ అన్నారు.హైదరాబాద్ తరలివెళ్లిన వారి సిరికొండ మాజీ సర్పంచ్ చిట్యాల రవిశంకర్, సంజీవ్,శ్రీదర్ తదితరులు ఉన్నారు.

జక్రాన్‌పల్లి: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగకు స్వాగతం పలికేందుకు మంగళవారం మండలంలోని తొర్లికొండ గ్రామం నుంచి మాదిగ సంఘసభ్యులు, ఎమ్మార్పీఎస్ నాయకులు తరలివెళ్లారు.తరలి వెళ్లిన వారిలో మాజీసర్పంచ్ రాజేశ్వర్, ప్రేమ్, మాదిగ సంఘాల సభ్యులు, ఎమ్మార్పీఎస్ నాయకులు ఉన్నారు.

తపాలా స్కీంలను సద్వినియోగం చేసుకోవాలి

● ఇన్‌స్పెక్టర్ సౌత్ డివిజన్ అధికారి సుశ్మిత బెనర్జీ

డిచ్‌పల్లి,ఆగస్టు 13: తెలంగాణ విశ్వవిద్యాలయంలో మంగళవారం తపాలా శాఖ ఆధ్వర్యంలో అవగహన సదస్సును ఇన్‌స్పెక్టర్ ఆఫ్ నిజామాబాద్ సౌత్ డివిజన్ అధికారి సుశ్మిత బెనర్జీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తపాల శాఖ అందిస్తున్న స్కీంల గురించి మాట్లాడారు. సేవిం గ్ ఖాతాలు, ఇన్సూరెన్స్‌ఖాతాలు, జనసురక్ష స్కీం పథకాలపై అర్థమయ్యేలా వివరించారు. ఈ కార్యక్రమంలో పోస్టల్ సిబ్బంది సబ్ పోస్టుమాస్టర్ చరణ్, స్నేహిత్, సుశాంక్, రవి పాల్గొన్నారు.

జీవన భృతి పెంపు కోసం ఆందోళన



సిరికొండలో బీడీ కార్మికుల ర్యాలీ

సిరికొండ, ఆగస్టు 13 : శాసన సభ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు జీవన భృతి రూ.4016 పెంచాలని కోరుతూ సిరికొండలో బీడీ కార్మికులు ఆందోళన చేశారు. తెలంగాణ ప్రగతి శీల బీడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సిరికొండ మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఆ తర్వాత తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి తహసీల్దార్ రవీందర్‌రావుకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు రామకృష్ణ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో పీసీసీ అధ్యక్షుడి హోదాలో బీడీ కార్మికులందరికీ జీవన భృతి రూ.2016 నుంచి 4016లకు పెంచుతామని హామీ ఇచ్చి తొమ్మిది నెలలు కావస్తున్న జీవన భృతి విషయంలో నిమ్మకు నీరెత్తనట్లు వ్యవహరించడం బాధాకరమన్నారు. ప్రభుత్వం జీవన భృతి పెంచే వరకు పోరాడాలని రామకృష్ణ కార్మికవర్గానికి పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రగతి శీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి ఆర్.రమేష్, మండలనాయకులు పుష్పమానస, జమున, లావణ్యలత, సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ఆర్మూర్ డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

పోలీస్ డ్రెస్‌తో ఫోన్లు చేసే వ్యక్తులను నమ్మొద్దు

సిరికొండ, ఆగస్టు 13 : పోలీస్ డ్రెస్‌లో ఉండి ఫోన్‌కాల్ చేసే వ్యక్తుల మాటలు నమ్మి మోసపోవద్దని సిరికొండ ఏఎస్సై దుర్గాప్రసాద్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం మండలానికి చెందిన ముగ్గురు వ్యక్తులకు పోలీస్ డ్రెస్‌లో ఉండి ఫోన్లు చేశారని చెప్పారు. మీ కుమారులు గంజాయితో దొరికాడని కొంత డబ్బులు పంపిస్తే వదిలి పెడుతామని మోసపు, అబద్ధపు మాటలు చెపుతున్నారని ఏఎస్సై చెప్పారు.ఆలాంటి వారి మాటలు నమ్మి డబ్బులు పంపిస్తే మోసపోతారని ఆయన ప్రజలకు గుర్తు చేశారు. మండలంలోని న్యావనంది గ్రామానికి చెందిన ఒకరికి, మైలారం గ్రామానికి చెందిన మరొకరికి ఇలాంటి ఫోన్‌కాల్స్ వచ్చాయన్నారు.

రైతులు పంపుసెట్లకు కెపాసిటర్లను అమర్చుకోవాలి

సిరికొండ, ఆగస్టు 13 : విద్యుత్ పంపుసెట్లకు రైతులు కెపాసిటర్లను అమర్చుకోవాలని ట్రాన్స్‌కో డీఈ ఉత్తం జాడే రైతులకు విజ్ఞప్తి చేశారు. సిరికొండ మండలం కొండూర్ గ్రామంలో ట్రాన్స్‌కో సిబ్బంది నిర్వహించిన పొలం బాట కార్యక్రమానికి ఉత్తం జాడే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రైతులను ఉద్దేశించి డీఈ మాట్లాడుతూ పంపుసెట్లకు 3కెవీఏఆర్ కెపాసిటర్లను అమర్చు కోవడం వల్ల మోటర్లు కాలిపోకుండ కాపాడుతాయని అన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లపై భారం పడకుండా ఉంటుందన్నారు. ఓల్టేజీ ప్రొఫైల్ మెరుగవుతుందని ఆయన రైతులకు సూచించారు. కార్యక్రమంలో సిరికొండ ఏఈ చంద్రశేఖర్, ఎస్ఎల్ఐ బాలచంద్రం, లైన్‌మెన్‌లు పాల్గొన్నారు.



బీజేవైఎం ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు13: పట్టణంలోని భారతీయ జనతా యువ మోర్చా ఆధ్వర్యంలో మంగళవారం హర్‌ఘర్ తిరంగాలో భాగంగా తిరంగా ర్యాలీ నిర్వహించారు.ఈసందర్భంగా అంబేద్కర్‌చౌరస్తా నుంచి యోగేశ్వ రకాలనీ మీదుగా అంబేద్కర్‌చౌరస్తా వరకు చేరుకున్నారు. తిరంగ ర్యా లీలో బీజేవైఎం నాయకులు, యువకులు, విద్యార్థులు పాల్గొని వంద మీటర్ల జాతీయ జెండాతో జాతీయగీతం, వందేమాతరం నినాదాలు చే శారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాయకుడు సంతోష్‌లు మాట్లాడుతూ యువకులు, విద్యార్థులు దేశభక్తిని పెంపొందించుకోవాలని అన్నారు. ఈకార్యక్రమం లో బీజేవైఎం ప్రధానకార్యదర్శి మందుల బా లు,మాజీమున్సిపల్ చైర్మ న్ కంచెట్టి గంగాధర్, బీజేవైఎం పట్టణ అధ్య క్షుడు కలిగోట ప్రశాంత్, మండల అధ్యక్షుడు నరేష్, బీజేపీ నాయకులు జెస్సుఅనిల్, ఆకుల శ్రీనివాస్,నర్సారెడ్డి, యువకులు పాల్గొన్నారు.

మాక్లూర్: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నేడు ప్రతీఒక్కరు తమ తమ ఇళ్లపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయాలని బీజేపీ జిల్లా కా ర్యదర్శి గంగోని సంతోష్ పిలుపు నిచ్చారు. మన ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు విద్యార్థులు, యువతలో దేశభక్తి నింపాలని ఉద్దేశంతో హర్ ఘర్ తిరంగాలో భాగంగా మంగళవారం మండలంలోని దాస్ నగర్‌లో 500మంది యువత, విద్యార్థులతో జాతీయ గీతాలతో వందే మాతరం నినాదాలతో చెబుతూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో విజయ్ ఇంజనీరింగ్ కళాశాలల చైర్మన్ నరేందర్‌రెడ్డి, బీజేవైఎం జిల్లా ప్రధానకార్యదర్శి మందుల బాలు, మండల అధ్యక్షుడు రమావత్ సురేష్, కార్యదర్శి ప్రవీన్, రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

ఎడపల్లి: ఎడపల్లి మండల కేంద్రంలో మంగళవారం మండల బీజేవైఎం ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులతో హర్ ఘర్ తిరంగా అభియాన్‌లో భాగంగా భారీ జాతీయ పతాకంతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం మండల అధ్యక్షులు తోట వెంకటేష్, నాయకులు బండారి నర్సింలు, ప్రేమ్ కుమార్, రాకేష్, గంగాధర్, సుధాకర్, కిరణ్,విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు ఉన్నారు.



ఆర్మూర్‌లో ర్యాలీలో పాల్గొన్న బీజేపీ నాయకులు, యువకులు

● బీబీపేటలో హర్ ఘర్ తిరంగా యాత్ర

దోమకొండ:: బీబీపేట మండల కేంద్రంలో మంగళవారం హర్ ఘర్ తిరంగా యాత్ర కార్యక్రమం నిర్వహించారు. బస్టాండ్ ప్రాంతంలో మండల బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా పార్టీ ఆదేశాల మేరకు కులమతాలకతీతంగా కార్యక్రమం నిర్వహించడం జరిగిందని మండల పార్టీ అధ్యక్షుడు బి. రంజిత్‌గౌడ్ తెలిపారు. అంతకు ముందు బస్టాండ్ సమీపంలో గల స్వాతంత్ర సమరయోధుల విగ్రహలు కడిగి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈకార్యక్రమంలో నక్క రవిందర్, పిడుగు శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యుడు రాజాగౌడ్, గ్రామ అధ్యక్షుడు సురేష్, శివ, మహేశ్, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన యువకుడిపై ఎలుగుబంటి దాడి



పొల్కంపేటలో ఎలుగుబంటి దాడిలో తీవ్రంగా గాయపడ్డ శ్రీనివాస్

లింగంపేట, ఆగస్టు13: మండలంలోని పొల్కంపేట గ్రామపంచాయతీ లక్కీగాని తండాకు చెందిన లంబాడి శ్రీనివాస్‌పై మంగళవారం ఎలుగు బంటి దాడిచేసి తీవ్రంగా గాయపరిచినట్లు గ్రామస్థులు తెలిపారు. అడవికి గేదలను వెతకడానికి మేడికుంద రాందాస్ గుడ్డం వద్ద గెదలను వెతుకుతుండగా ఎలుగుబంటి పిల్లతల్లి శ్రీనివాస్‌పై దాడికి ప్రయత్నించడంతో శ్రీనివాస్ చెట్టుపైకి ఎక్కగా ఎలుగుబంటి శ్రీనివాస్ కాలును పట్టి లాగడంతో తీవ్ర గాయాలు అయ్యాయి. అతనితో పాటు కుక్కలు ఉండడంతో కుక్కలు ఎలుగు బంటిపై దాడికి ప్రయత్నించడంతో అవి శ్రీనివాస్‌ను వదిలిపోయాయని తెలిపారు. శ్రీనివాస్‌ను 108లో కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సలు నిర్వహిస్తున్నారు.

పంట పొలాల్లోకి దూసుకెళ్లిన స్కార్పియో



నాగిరెడ్డిపేటలో పొలాల్లోకి దూసుకెళ్లిన స్కార్పియో

నాగిరెడ్డిపేట, ఆగస్టు 13: మండల కేంద్రం సమీపం లో మంగళవారం ఉదయం స్కార్పియో వాహనం అదు పు తప్పి పంట పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తా పడింది. నాందేడ్ నుంచి హైదరాబాద్ వెళుతున్న స్కార్పియో వాహనానికి ముందు వెళుతున్న ఆర్టీసీ బస్సు డ్రైవర్ నాగిరెడ్డిపేట మండల కేంద్రం సమీపంలో కల్వర్టు వద్ద ప్రధాన రహదారిపై ఉన్న స్పీడ్ బ్రేకర్లు ఉండటంతో సడెన్‌గా బస్సు వేగాన్ని తగ్గించాడు. దీంతో వెనకాలే వేగంగా వస్తున్న స్కార్పియో వాహనాన్ని డ్రైవర్ రాహుల్ పక్కకు తప్పించే క్రమంలో ఎదురుగా వస్తున్న ఎక్సెల్ వాహనాన్ని ఢీకొని రోడ్డు కిందకు పంట పొలా ల్లోకి దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఎక్సెల్‌పై వస్తున్న మండలంలోని లింగంపల్లి కలాన్ గ్రామానికి చెందిన శింది గారి వెంకటేశం గాయపడ్డాడు. ప్రమాదం జరిగిన సమయంలో స్కార్పియో వాహనంలో డ్రైవర్ రాహుల్‌తో పాటు రోహిత్, రోషన్, నందన్ ఉన్నారు. వారికి ఎలాంటి గాయాలు కాలేదు.

హనుమాన్ ఆలయానికి సీసీ కెమెరాల వితరణ

భిక్కనూరు, ఆగష్టు 13: మండలంలోని రామేశ్వర్‌పల్లి హనుమాన్ ఆలయానికి పెద్దోల్లలక్ష్మీ-నర్సారెడ్డి జ్ఞాపకార్థం వారికూతురు సరోజన సంజీవరెడ్డి సీసీ కెమెరాల వితరణ చేశారు. ఈసందర్భంగా మాజీ వీడీసీ ఛైర్మన్ తక్కళ్ల నర్సారెడ్డి, భజన మండలి అధ్యక్షుడు బాల్‌రెడ్డి మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి ప్రతిఒక్కరు సహకరించాలని కోరారు.ఆలయంలో ప్రతిశనివారంపెద్దఎత్తున భజన కార్యక్రమాలు,ప్రత్యేక పూజలు నిర్వహించడం జరుగుతుందన్నారు.ఈకార్యక్రమంలో గ్రామస్థులు ఉన్నారు.

బీర్కూర్‌లో జాతీయ జెండాల పంపిణీ

బీర్కూర్,ఆగస్టు 13: దేశప్రధాని నరేంద్ర మోడి ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం బీర్కూర్ మండల కేంద్రంలో బీజేపీ శ్రేణులు హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని చేపట్టారు. జాతీయ జెండాలను చేత బూని గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఇందులో భాగంగా బీజేపీ శ్రేణులు ఇంటింటికి తిరుగుతూ జాతీయ జెండాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

● సెల్ఫీ వీడియోలో ఆవేదన వెల్లగక్కిన బాధితురాలు



కామారెడ్డి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న దృశ్యం

కామారెడ్డి టౌన్, ఆగష్టు 13: వడ్డీ వ్యాపారి వేధింపులు భరించలేక ఓ వివాహిత ఆత్మహత్యకు యత్నించిన ఘటన కామారెడ్డి జిల్లాకేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. బాధితురాలి కథనం ప్రకారం.. కామారెడ్డి పట్టణంలోని గాయత్రినగర్‌కు చెందిన లక్ష్మీబాయి(40) భవన నిర్మాణాలను చేపట్టి.. వాటిని విక్రయిస్తూ జీవనం సాగిస్తోంది.తనవ్యాపా రం నిమిత్తం కామారెడ్డికి చెందిన విశ్వనాథం అనేవ్యాపారి వద్ద ఇటీ వల రూ.32లక్షలనుఅప్పుగా తీసుకుంది. తీసుకున్న అప్పునకు గ్యా రెంటీ కింద తనసొంత ఇంటితో పాటు మరో రెండు ప్లాట్లను విశ్వనా థం జీపీఏ చేసుకున్నాడు.తీసుకున్న డబ్బునువడ్డీతో సహా చెల్లించ నప్ప టికీ.. వ్యాపారి తన ఇంటిని, ప్లాట్లను తిరిగి ఇవ్వడం లేదు. ఈ విష య పై లక్ష్మీబాయి పలుమార్లు అతన్ని అడిగినా.. స్పందించలేదు. పైగా అప్పు తీసుకున్న సమయంలో తెల్లకాగితంపై సంతకం తీసుకుని ఆ తర్వాత దొంగచాటుగా ఇంటితో పాటు ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేసుకు న్నా డని లక్ష్మీబాయి ఆరోపించింది. డబ్బులు చెల్లించినా..ఇంటితో పాటు ప్లాట్ల ను తిరిగి ఇవ్వడానికి మరో రూ.56లక్షలను డిమాండ్ చేస్తున్నాడని తెలి పింది. ఎందుకు ఇవ్వాలని ప్రశ్నిస్తే రౌడీలను పెట్టి దాడులు చేయిస్తు న్నాడని ఆవేదన వ్యక్తం చేసింది. దీంతో జిల్లా ఎస్పీ తనకు న్యాయం చేయాలని కోరుతూ ఒక సెల్ఫీ వీడియా తీసి కుటుంబసభ్యులకు, సోషల్ మీడియాలో పోస్టు చేసింది. వెంటనే అప్రమత్తమైన కుటుంబసభ్యులు వెంటనే కామారెడ్డి జిల్లా ఆసుపత్రికి తరలించారు.ప్రస్తుతం ఆమె పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

'ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం శ్రమిస్తా'



నాగిరెడ్డిపేటలో మాట్లాడుతున్న హర్షవర్ధన్‌రెడ్డి

నాగిరెడ్డిపేట, ఆగస్టు 13 : రాష్ట్రంలోని ప్రభుత్వ ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం శ్రమిస్తానని, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడానికి అహర్నిశలు కృషి చేస్తానని పీఆర్‌టీయూ తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షులు హర్షవర్ధన్‌రెడ్డి తెలిపారు. ఆయన మంగళవారం సాయంత్రం మండల కేంద్రంలో జరిగిన పీఆర్‌టీయూ సభ్యులు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యల గురించి ఏనాడూ పట్టించుకోలేదని, ఉపాధ్యాయులు తమ సమస్యల సాధన కోసం ధర్నాలు, రాస్తారోకోలు చేసిన ప్రయోజనం కలగలేదని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో ముందుందని ఆయన తెలిపారు. ఉపాధ్యాయుల బదిలీలతో పాటు ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించిందన్నారు. ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల బదిలీల్లో ఎలాంటి అక్రమాలకు తావు లేకుండా బదిలీలను ప్రభుత్వం పారదర్శకంగా నిర్వహించిందన్నారు. ఏళ్ల తరబడి అధ్యాపకులకు సర్వీస్ రూల్స్, ఉద్యోగ భద్రత లేకపోవడంతో ఉపాధ్యాయులకు సర్వీస్ రూల్స్ సాధించడమే తమ ప్రధాన లక్ష్యమన్నారు. సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులకు వచ్చే విద్యా సంవత్సరం వరకు మినిమం టైమ్స్ స్కేల్ (యంటీఎస్) అమలయ్యేలా కృషి చేస్తాన న్నారు. ఏళ్ళ తరబడి ఎలాంటి బదిలీలు లేక ఒకే చోట పని చేస్తున్న మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు త్వరలోనే కాంగ్రెస్ ప్రభుత్వం బదిలీలను చేపటనుందని ఆయన తెలిపారు. ఇతర ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే కస్తూర్బా గాంధీ పాఠశాలల ఉపాధ్యాయులకు సెలవులు అమలు అయ్యేలా కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులందరికీ ఐదు లక్షల వరకు హెల్త్ ఇన్సురెన్స్ అమలయ్యేందుకు కృషి చేస్తానన్నారు. పీఆర్‌టీయూ తెలంగాణలో ప్రస్తుతం రాష్ట్రంలో 17 వేల సభ్యత్వాలున్నాయని, సెప్టెంబరు 4వ తేది వరకు 50 వేల సభ్యత్వాలను నమోదు చేస్తామన్నారు. ఉపాధ్యాయులందరూ పీఆర్‌టీయూ తెలంగాణలో తమ సభ్యత్వాలను తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అనంతరం కస్తూర్బా గాంధీ పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులు రాఖీలు కట్టారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యానారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు లింబేష్, ఓంప్రకాష్, కామారెడ్డి జిల్లా అధ్యక్షులు అంబీర్ మనోహర్‌రావు, ప్రధాన కార్యదర్శి లక్ష్మీ రాజ్యం, మండల అధ్యక్షుడు రాష్ట్రప్రధాన కార్యదర్శి సబాత్ కృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిజాంసాగర్: ఉమ్మడి నిజాంసాగర్ మండలం పీఆర్‌టీయూ సర్వసభ్య సమావేశం మండలం ఎమ్మార్సీలో జిల్లా ప్రధాన కార్యదర్శి కుశాల్ అధ్యక్షతన నిర్వహించారు. ఉమ్మడి నిజాంసాగర్ మండల పీఆర్‌టీయూ శాఖ సర్వసభ్య సమావేశంలో ఉపాధ్యాయులు, ఉపాధాయురాళ్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సర్వసభ్య సమావేశం అనంతరం ఉమ్మడి నిజాంసాగర్ మండల పీఆర్‌టీయూ నూతన పాలకవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా కె.నారాయణ, ప్రధాన కార్యదర్శిగా సురేందర్, అసోసియేషన్ అధ్యక్షునిగా అజయ్ కుమార్, ఉపాధ్యక్షులుగా నిర్మల, కార్యదర్శి రాజులను జిల్లా ప్రధాన కార్యదర్శి కుశాల్ ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన కార్యవర్గం ఉపాధ్యాయుల సమస్యల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పరిష్కారానికి కృషి చేయాలని కుశాల్ కోరారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచడమే కాకుండా ప్రతి పాఠశాలలో చదివే విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషిచేయాలన్నారు. ఈ సమావేశంలో మాజీ పీఆర్ టీయూ అధ్యక్షులు కె.భాస్కర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి సంతోష్ కుమార్, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయురాళ్లు పాల్గొన్నారు.

కామారెడ్డిలో ప్రపంచ అవయవదాన దినోత్సవం



కామారెడ్డిలో మాట్లాడుతున్న డాక్టర్ రాంసింగ్

కామారెడ్డిటౌన్, ఆగష్టు 13: కామారెడ్డి జిల్లాకేంద్రంలోని పీజెఆర్ స్ఫూర్తి డిగ్రి కళాశాలలో సూర్య ఆరోగ్యసంస్థ, ఇన్స్‌ఫైర్ సోసైటీ ఫర్ రూరల్ డెవలప్మెంట్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ అవయవదాన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ రాంసింగ్ మాట్లాడుతూ తీసుకోవడం కంటే ఇవ్వడం గొప్పకార్యమని, ప్రతిఒక్కరు అవయవదానానికి ముందుకు రావాలని సూచించారు. మనం చనిపోయిన తదనందరం మూత్రపిండాలు, హెర్నియా, గుండె, కాలేయం, ఊపిరితిత్తులు, కళ్ల దానం చేయ్యవచ్చునని అన్నారు. తాను మరణించిన వీటిని దానం చేస్తే మరో నలుగురికి ప్రాణం పోయవచ్చునని అన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలను చేపడుతున్న సూర్య ఆరోగ్యసంస్థ, ఇన్స్‌ఫైర్ సోసైటీ ఫర్ రూరల్ డెవలప్మెంట్ ప్రతినిధులను అభినందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు రాజేంద్రకుమార్, విక్రమ్, అమృతరాజేందర్, కళాశాల ప్రిన్సిపాల్‌విజయ్‌కుమార్, సిబ్బంది, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భిక్కనూరు: అన్నదానాల కన్నా అవయవదానం చాలా గొప్పదని, ఈ అవయవదానం చేయడానికి ప్రతిఒక్కరు ముందుకురావాలని భిక్కనూరు సీఐ సంపత్‌కుమార్ అన్నారు. మంగళవారం భిక్కనూరు విజ్ఞాన్ పాఠశాలలో జీవన్‌దాన్ ఆధ్వర్యంలో అవయవదానంపై అవగాహన సదస్సు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఇతరితర కారణాలతో మరణించిన వారి అవయవాలను సరైనా సమయంలో దానం చేస్తే మరో నలుగురికి ప్రాణం పోయ్యవచ్చునని అన్నారు. అవయవదానంపై ప్రతిఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. దేశంలో లక్షలాది మంది కార్నియా సమస్యతో బాధనడుతూ కంటి చూపు లేకుండా జీవిస్తున్నారని వారికి మరణించిన వ్యక్తి కార్నియా తీసి అమర్చడం వలన చూపును ప్రసాదించవచ్చునన్నారు. అలాగే ఎంతో మంది కిడ్నీ, కాలేయం, తదిదర వాటి మార్పిడి కోసం ఎదురు చూస్తున్నారని అన్నారు. అనంతరం దోమకొండ ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ సమాజానికి మంచి చేయాలన్న ఆలోచన కలగాలని, అవయవదానంతో మరికొందరి జీవితాల్లో వెలుగు నింపవచ్చునని అన్నారు. దినిపై ప్రజల్లో అవగాహన రావాలన్నారు. అనంతరం మండలంలో ఇదివరకు అవయవదానం చేసిన వ్యక్తుల కుటుంబ సభ్యులను ఘనంగా సన్మానించారు.

● రూ.5వేల ఆర్థిక సహాయం

ఇటీవల రోడ్డుప్రమాదంలో మరణించిన అవయవదాత ప్రవీణ్ కుటుంబానికి దోమకొండ ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ రూ.5వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్ కుటుంబంతో పాటుగా అవయవ దాతల కుటుంబాలకు అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో ఎల్లయ్య, ఎస్సై సాయి కుమార్, పాఠశాల కరస్పాండెంట్ భాస్కర్‌రెడ్డి, రెడ్‌క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు, జాతీయ మానవ హక్కుల కమిటీ జిల్లా అధ్యక్షుడు మహిపాల్, జీవన్‌దాన్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాలకు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

● ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్

భిక్కనూరు, ఆగష్టు 13: రైతులు విద్యుత్ ప్రమాదాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం భిక్కనూరులో ఎన్‌పీడీసీఎల్ కామారెడ్డి సర్కిల్ ఆధ్వర్యంలో ట్రాన్స్‌కో అధికారులు రైతు పొలం బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ రైతులు విద్యుత్ సమస్య ఏర్పడితే తమ విద్యుత్ సిబ్బందికి సమాచారం అందిస్తే వారు అక్కడికి చేరుకుని సమస్యను పరిష్కరిస్తారని, రైతులు తమతో సహకరించాలన్నారు. రైతులు విద్యుత్ ప్రమాదాలకు గురికాకుండా తమ సూచనలు పాటించాలన్నారు. ముఖ్యంగా వర్షకాలంలో రైతులు విద్యుత్‌పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ సిబ్బంది బెర్మనల్, బాల్‌రాజు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్‌ను కలిసిన బాన్సువాడ బీఆర్ఎస్ నేతలు



కేటీఆర్‌ను కలిసిన బాన్సువాడ నాయకులు

బాన్సువాడటౌన్,ఆగస్టు 13: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ,మాజీ మంత్రి కేటీఆర్‌ను మంగళవారం ఆయన నివాసంలో బాన్సువాడ బీఆర్ఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. బాన్సువాడ మున్సిపాలిటీ వైస్ ఛైర్మెన్ షేక్ జేబేర్ కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులతో కేటీఆర్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో బాన్సువాడలో బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయమన్నారు. రేవంత్‌రెడ్డి పరిపాలన సమర్థత ఏంటో ప్రజలకు తెలిసిపోయిందన్నారు. మార్పు పేరుతో జనాన్ని ఏమారుస్తున్నారని, కాంగ్రెస్‌కు ప్రజలే తగిన గుణపాఠం నేర్పుతారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీమంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, బాన్సువాడ నాయకులు మోచి గణేశ్ , ఆరిఫ్ తదితరులున్నారు.

ఘనంగా భగలాముఖి అమ్మవారి వార్షికోత్సవం



అమ్మవారి విగ్రహం

ఎల్లారెడ్డి, ఆగస్టు 13 :ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని బీడీ వర్కర్స్ కాలనీలో ఆర్టీసీ బస్‌డిపో పక్కన మంగళవారం భగలాముఖిఅమ్మవారి ద్వితీయ వార్షికోత్సవాన్ని ప్రముఖ జ్యోతిష్య పండితులు, పీఠం నిర్వాహకులు క్రాంతి పటేల్ ఆధ్వర్యంలో అమ్మ వారికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు పసుపు. కుంకుమార్చనలు,వివిధపండ్ల రసాలతో అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్రాంతి పటేల్ మాట్లాడుతూ వివిధ సమస్యలతో బాధపడు తున్న వారు భక్తి శ్రద్ధలతో అమ్మవారిని పూజిస్తే సమస్యలు పరిష్కారం అవుతాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ఆంధ్రప్రదే శ్‌కు చెందిన వివిధ జిల్లాల ప్రముఖ వ్యాపారవేత్తలు భక్తులు స్థానిక భక్తులు బాలకిషన్ , ముత్యపు వీరేశలింగం, ఓర విఠల్ రేవంత్ తదితరులు పాల్గొన్నారు.

నివాసపు పైకప్పు కూలి ఒకరికి గాయాలు

ఎల్లారెడ్డి, ఆగస్టు 13 : నివాసపు పైకప్పు కూలి ఒకరికి తీవ్ర గాయాలు అయిన సంఘటన ఎల్లారెడ్డిలో చోటుచేసుకుంది స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం ఎల్లారెడ్డి మున్సిపాలిటీలోని ఏడో వార్డులో నివాసముంటున్న నెల్లి శ్రీను అనే వ్యక్తి ఇంట్లో ఉండగా సోమవారం రాత్రి ఇంటిపై కప్పు కూలీ మీద పడడంతో స్థానికులు గమనించి కూలిన మట్టి కట్టెలను తీసి రక్షించడంతో ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న స్థానిక నాయకులు మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజుతో కలిసి పరామర్శించారు. ఇంటిని పరిశీలించి ప్రభుత్వపరంగా ప్రయోజనాలను త్వరితగతిన అందించే ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు వినోద్ గౌడ్, నాయకులు సతీష్, ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

చెరువులో పడి మహిళ మృతి

పిట్లం ఆగస్టు 13: మండల కేంద్రంలోని ఊరచెరువులో మహిళ మృతదేహం నీటిలోపైన తెలడంతో స్థానికులు పోలీసులు సమాచారం అందించారు.పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.ఎస్సై రాజు తెలిపిన వివరాలు పిట్లం గ్రామానికి చెందిన మందాడి బశవ్వ(42)గత కొంత కాలంగా ఆరోగ్యం బాగు లేకపోవడం,సంవత్సర క్రితం తల్లి మరణించగా జీవితంపై విరక్తి చెంది మంగళవారం ఉదయం ందజ 8గంటల ప్రాంతంలో ఊరచెరువులో దూకి ఆత్మహత్య చేసుకుందని మృతురాలి అన్నగంగారాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.మృతురాలికి పిల్లలు లేరు.

78వ స్వాతంత్ర్య వేడుకలకు ఏర్పాట్లు

నిజాంసాగర్, ఆగస్టు 13: 78వ స్వాతంత్ర్య వేడుకలు గురువారం నిర్వహించనున్నారు. తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో జెండా గద్దెకు మంగళవారం రంగులు వేశారు. ఉమ్మడి మండలంలో గ్రామపంచాయతీ కార్యాలయాల ఆవరణలు, పాఠశాలలు పలుచోట్ల ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నారు. ఈ వేడుకలను నిర్వహించాలని తహసీల్దార్ భిక్షపతి తెలిపారు.

ఒకరి అదృశ్యం

దోమకొండ, ఆగస్టు 13:మండలంలోని సంగమేశ్వర్ గ్రామానికి చెందిన ఒక వ్యక్తి గత రెండు రోజుల నుంచి అదృశ్యమైన సంఘటన చోటు చేసుకుంది. ఎస్సై ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం..సంగమేశ్వర్ గ్రామానికి చెందిన గెరిగంటి యాదగిరి భూమి వివాదంలో తండ్రిపై అలిగి ఇంటి నుంచి వెళ్లినట్లు ఎస్సై తెలిపారు. మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

ఎల్లారెడ్డి కేజీబీవీలో షీ టీమ్‌పై అవగాహన

ఎల్లారెడ్డి, ఆగస్టు 13: ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోనరి కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో మంగళవారం పోలీసు కళా బృందం షీ టీమ్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సైబర్ క్రైమ్ రోడ్ సేఫ్టీ బాల్య వివాహాలు, మానవ అక్రమ రవాణా నిర్మూలన మరియు డ్రగ్స్ మత్తు పదార్థాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎల్లారెడ్డి ఎస్ఐ మహేష్ మాట్లాడుతూ ఎవరైనా ఆకతాయితలు ఇబ్బందులకు గురి చేస్తే షీ టీమ్ నెంబర్ 871268694 అలాగే సైబర్ నేరాలకు 1930 నెంబర్‌కు ఫోన్ చేసి సేవలు వినియోగించుకోవాలని అత్యవసర పరిస్థితులలో టోల్ ఫ్రీ నెంబర్ 100కు ఫోన్ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి కళాబృందం సిబ్బంది, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలు తపాలశాఖ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

● జిల్లా తపాల ఇన్‌స్పెక్టర్ సుజిత్‌కుమార్

భిక్కనూరు, ఆగస్టు 13: తపాలశాఖ అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా తపాల ఇన్‌స్పెక్టర్ సుజిత్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని సిద్ధరామేశ్వరనగర్ గ్రామంలో తపాలశాఖ సేవలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు పోస్టాఫీసులో అకౌంట్‌ను తీసుకోవాలన్నారు. బ్యాంకుల కంటే ఉత్తమ సేవలను తపాలశాఖ అందిస్తుందన్నారు. అనంతరం ఎస్‌బీ, ఆర్‌డీ, టీడీ, ఎస్ఎస్ఏ, పీపీఎఫ్, పీఎల్ఐ, ఆర్‌పీఎల్ఐ, ఎంఎస్ఎస్‌సీ, ఇన్సూరన్స్ తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సబ్‌పోస్టుమాస్టర్ రాజేందర్‌రెడ్డి, బ్రాంచ్ పోస్టుమాస్టర్ సుధార్, మెయిల్‌పర్సన్ వెంకటరాంరెడ్డి, సిబ్బంది సునీత, సురేష్‌కు మార్, రాంచంద్రం, సిద్దరాములు, రచన, స్వామి, వీడీసీ అధ్యక్షుడు శ్రీనివాస్, గ్రామస్థులు పాల్గొన్నారు.

పెద్ద కొడప్‌గల్ ఆర్ఐ సస్పెన్షన్

పెద్ద కొడప్‌గల్, ఆగస్టు 13: పెద్ద కొడప్‌గల్ మండల రెవిన్యూ ఇన్స్‌పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న పండరిని విధుల నుంచి తొలగిస్తున్నట్లు మండల తహసీల్దార్ దశరథం తెలిపారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమం జరుగుతుండగా వడ్లం గ్రామానికి చెందిన అంజయ్య పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్న ఘటనలో బాధితుడు అంజయ్య ఆర్ఐ కారణంగా తాను ఆత్మహత్యాయత్నం చేసుకున్నట్లు వీడియో వైరల్ అయింది, దీంతో జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఆర్ఐ పండరిని సస్పెన్షన్ చేసినట్లు తహసీల్దార్ తెలిపారు.

ముగిసిన ఎస్‌జీఎఫ్ క్రీడలు



ఖో ఖో ఆడుతున్న విద్యార్థులు

పెద్ద కొడప్‌గల్, ఆగష్టు 13: మండలంలో రెండు రోజుల నుంచి కొనసాగుతున్న ఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడా పోటీలు మంగళవారం నాటితో ముగిసాయి. మండల స్థాయిలో విద్యార్థులలో క్రీడా నైపుణ్యం పెంపొందించడానికి ఈ క్రీడలు నిర్వహించగా మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన పాఠశాలల విద్యార్థులు పోటీలలో పాల్గొని తమ నైపుణ్యాన్ని ప్రదర్శించారు. అండర్ 14 మరియు అండర్ 17 విభాగంలో బాలుర, బాలికల విభాగంలో మంగళవారం పెద్ద కొడప్‌గల్ ఉన్నత పాఠశాలలో ఖోఖో, వాలీబాల్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో పాల్గొన్న విద్యార్థుల తమ నైపుణ్యాన్ని ప్రదర్శించి మండల స్థాయి పోటీలలో విజేతలుగా నిలిచారు. వాలీబాల్ బాలురు అండర్ 14 విభాగంలో ప్రథమస్థానంలో కొడప్‌గల్ ఉన్నత పాఠశాల, ద్వితీయ స్థానంలో కాటేపల్లి ఉన్నత పాఠశాల నిలిచాయి, ఇక అండర్ 17 బాలుర విభాగంలో కొడప్‌గల్ ఉన్నత పాఠశాల ప్రథమ స్థానం, ద్వితీయ స్థానంలో కాటేపల్లి ఉన్నత పాఠశాల నిలిచాయి. ఈ పోటీలలో కొడప్‌గల్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంకమల, పీఈటీలు ధర్మేందర్, మల్లేష్, పర్వీన్,జ్యోతిలు పాల్గొన్నారు.

హిందూ సంఘాల బంద్ సక్సెస్

మద్నూర్, ఆగస్టు 13: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులు, హత్యలకు నిరసనగా ఉమ్మడి మద్నూర్ మండలంలోని మద్నూర్, మినన్నూర్, డోంగ్లీ, గ్రామాల్లో బంద్ విజయవంతమైంది. హిందూ సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం బంద్‌కు పిలుపునివ్వడంతో వ్యాపారస్తులు, విద్యా సంస్థల యజమాన్యాలు, బంద్‌లో స్వచ్ఛందంగా పాల్గొని బంద్‌ను విజయవంతం చేశారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రైవేటు కళాశాలలు, పాఠశాలలతో పాటు పెట్రోల్ బంకులు, వైన్స్‌లు, వివిధ వ్యాపార సముదాయాలను స్వచ్ఛందంగా మూసివేసి బంద్‌కు మద్దతు తెలిపారు. ఉమ్మడి మద్నూర్ మండలంలో జరిగిన హిందూ సంఘాల బంద్‌లో అందరూ పాల్గొని విజయవంతం చేయడంతో హిందూ సంఘాల నాయకులు ప్రజలకు వ్యాపార సంస్థల వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగుకుండా మద్నూర్ ఎస్సై విజయ్ కొండ భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.